## ఓటు నమోదుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

**- తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్‌నాథ్**

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్‌నాథ్ కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సుజాత కళాశాల విద్యార్థుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడంతోపాటు ఓటు హక్కును కూడా వినియోగించుకోవాలని కోరారు. దేశభవిష్యత్తు ప్రస్తుతం యువతమీదే ఆధారపడి ఉందన్నారు. యువత ఎక్కువగా రాజకీయ రంగంలోకి వచ్చి దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా దేశ,రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దగల సమర్థులైనవారిని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ యువతకు కల్పించిన ఓటు నమోదు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున పట్టణంలో ఓటు నమోదుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, పట్టణ ప్రణాళికాధికారి సాంబయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



## తొలి సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** ఆర్థిక అసమానతలు, సామాజిక ఆంక్షలు వెరసి అణగారిన వర్గాలు అభివృద్ధికి నోచుకో ఆటవిక జీవనానికి అలవాటుపడగా, కోటి వెలుగుల సూరీడులా బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో ఉదయించిన ఆశయ సూరీడు మహాత్మా జ్యోతిబా పూలే అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కా శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే 132వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కా మాట్లాడుతూ మహాత్మా పూలే ఆశయసాధనలో ప్రతి ఒక్కరూ పీడిత ప్రజల విద్య, సామాజిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, తద్వారానే పూలే ఆశయాలను సజీవంగా నలిపినవారమౌతామని తెలిపారు. తొలుత జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జి సోమరౌతు వీరశేఖరరావు, కొండెపు సుబ్బారావు, చెంచయ్య, రాము, కాశింశెట్టి ప్రసాద్, చిల్లా అంజి, మూకిరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఫెన్సింగ్ పోటీల జట్టుకు శ్రీవేద హైస్కూల్ విద్యార్థులు

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** జిల్లా స్థాయి అండర్-17 విభాగం ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు పట్టణానికి చెందిన శ్రీవేద హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు తెలిపారు. తలారి రేవంత్ నందన్, కె.మనోజ్‌కుమార్ కత్తిసాము రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు డిసెంబర్ 7వ తేదీన కడపలో జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపాల్ అంబటి ఏడుకొండలు, పిఇటి రూకేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



## దేవాలయ భూములు అన్యాక్రాంతం కానివ్వం

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయ భూములను ఆటోనగర్‌కు ఇవ్వడానికి భారతీయ జనతాపార్టీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల పాలకమండలి పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిసిందన్నారు. ఈ భూముల అన్యాక్రాంతాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ట్లు చెప్పారు. ప్రభుత్వాధికారులు ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాల్సిందేనన్నారు. పంట పొలాలను ఈ విధంగా అన్యాక్రాంతం చేయడం సరైన విధానం కాదని చెప్పారు. ఈ విషయంలో బిజెపి ఆధ్వర్యంలో తీవ్రంగా ఉద్యమిస్తామని చెప్పారు. వినతిపత్రం అందజేసినవారిలో జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు మొగిలిపువ్వ సాంబశివరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు కలపాల విజయలక్ష్మి, నాయకులు గోవాడ వెంకటకృష్ణారావు, ఆరె వెంకట్రావు, ఉదయచంద్రరావు, గండు శ్రీనివాసరావు, తోట జనార్ధనరావు, పాతూరి సోమేశ్వరరావు, చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు, చలపతిరావు, గుడివాడ పవన్, భట్టిప్రోలు రామకృష్ణ తదితరులున్నారు.



## రీసర్వేకి సన్నద్ధంగా ఉండాలి

**- తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్‌నాథ్**

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు త్వరలో మన మండలంలో జరగబోయే భూముల రీ సర్వేకి సన్నద్ధంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్‌నాథ్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూముల హద్దులు నిర్ణయించడం, గ్రామ హద్దులు నిర్ణయించడం, సాగురైతుల వివరాలు, వారికి సంబంధించిన ఫోన్ నెంబర్లు, మరణించిన పట్టాదారులు ఉంటే అర్హులైన వారి కుటుంబ సభ్యుల పేరున ముటేషన్ చేయడం వంటివి చేసి సిద్ధంగా ఉంచుకొంటే రీ సర్వే చేసేటప్పుడు సమస్యలు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు రీసర్వే ఎప్పుడు ప్రారంభించమన్నా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుతం పంట నూర్పిడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి రైతు గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని విక్రయించుకొనే విధంగా చూడాలన్నారు. వీఆర్వోలు వారి వారి పరిధిలో ఎవరెవరు నూర్పిడిలు జరుపుతున్నారు. వారి వద్ద ఏ మేరకు ధాన్యం నిల్వలలు ఉన్నాయి..? దళారులెవరైనా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారా..? ఎవరైనా తక్కువ ధరకు విక్రయించే పరిస్థితి వస్తే వారిని తక్కువ ధరకు విక్రయించుకోకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతుల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నలబోట్ల వాసు, మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుంకర కోటయ్య తదితరులున్నారు.



## అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు వివేకా విద్యార్థి

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** డిసెంబర్ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నేపాల్‌లో జరగబోయే అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు పట్టణంలోని వివేకా కళాశాల విద్యార్థి బండ్లమూడి పవన్ ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు తెలిపారు. ఈ నెల 12నుంచి 14వరకు గోవాలో జరిగిన జాతీయ యూత్ నేషనల్ గేమ్స్‌లో భాగంగా జరిగిన కబడ్డీ పోటీలలో అత్యంత ప్రతిభ కనవరచినట్లు చెప్పారు. దీంతో అంతర్జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభకు ప్రతిఫలంగా మెరిట్ సర్టిఫికెట్, మెడల్ సాధించాడన్నారు. ఈ సందర్భంగా పవన్‌ను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు. నేపాల్‌లో జరగబోయే పోటీలలో పాల్గొనే విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.5వేలు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భవాని ప్రసాద్, డీన్ బోస్, కోఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



● వేమూరు ● రేపల్లె ● బాపట్ల ● పర్చూరు ● అద్దంకి ● చీరాల

## స్పందన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలి

**బాపట్ల, నవంబర్28,ప్రభాతవార్త:** స్పందన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను అదేశించారు. స్థానికజిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందనసమేశపు మందిరంలో సోమవారం స్పందనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. స ్పందన అర్జీలను ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పరిష్కరించాలన్నారు. గడువులోగా అర్జీలుపరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం మహాత్మాజోతి పూలే 130వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోత్యరావు పూలే సమాజంలోని రుగ్మతలను తొలగిండానికి విషేషంగా కృషి చేశారన్నారు. ప్రజల్లో చైతన ్యం తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు. జిల్లా రెవిన్యూ అధికారి లక్ష్మిశివజ్యోతి, సిపివో భరత్‌కుమార్, రవాణాశాఖా అధికారి కె.చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, ద్వామా జెడి శంకర్‌నాయక్, మత్స్య శాఖ జెడి సురేష్, జిల్లా పంచాయితి అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, మున్సిపల్ కమీషనర్ బానుప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



## స్పందన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలి

**-స్పందనకు 63 పిర్యాదులు**

**బాపట్లరూరల్, నవంబర్28,ప్రభాతవార్త:** స్పందన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు..స్థానికజిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు తమ సమస్యలను ఇబ్బ ందులను స్వయంగా ,సే ్వచ్ఛగా స్పందన కార్యక్రమంలో విన్నవించుకోవచ్చునన్నారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థికనేరాలు, భూ తగాదాలు, ఇతర సమస్య లపై మొత్తం 63 పిర్యాదులు వచ్చాయన్నారు. స్పందనలో వచ్చిన పిర్యాదులను వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ధిష్ట గడువులోపు చర్యలు తీసుకుని బాధితులకు త్వరిత గతిన న్యాయం చేయాలని అధికారులను అదేశించారు. సదరు నివేధికను జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్ణిత సమయంలోగా అందించాలన్నారు. స్పందీన అర్జీల పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన ఇన్స్‌పెక్టర్ ఎ.మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



## బడుగు,బలహీన వర్గాల ప్రజలలో అత్మస్థైర్యం కల్పించిన వ్యక్తి పూలే

**బాపట్ల, నవంబర్28,ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహానీయుడు జ్యోతిరావుపూలు అని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జ్యోతిరావు పూలే 132 వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సామాజిక తత్వ వేత్తగా సమాజంలో అనేక విధాలుగా ప్రజలను చైతన్యం పరిచారన్నారు. ప్రజలల్లో అనాధికాలంగా వస్తున్న వివక్షతలను నిరూ ్మలించడాని తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వితంతు పునర్వివాహం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ప్రపంచానికి పూలే జీవితం అదర్శమన్నారు. పూలే విద్య, వివక్ష, పేదరికం, ఆర్థిక అసమానత్వం నిర్మూలించడానికి కుల, మత, రహిత సమాజ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారన్నారు. దీనబంధు అనే పత్రిక ద్వారా పేదలు, కార్మికుల సమస్యలు సమాజానికి తెలిసేలా చేశారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జ్యోతిబాపూలే తన గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గోప్పతనం సులభంగా అర్ధమవుతుందన్నారు. ఆయన ఆశయానలుస్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డిసిఆర్పి డిఎస్పీ జె.లక్ష్మయ్య, డిఎస్‌బి ఇన్స్‌పెక్టర్ ఎ.శ్రీనివాస్, ఏ ఓ వై, శివప్రసాదరావు, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మధరావు, వెల్ఫేయిర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, డిపిఓ సిబ్బంది, పోలీసుసిబ్బ ంది, తదితరులు పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే

**బాపట్ల, నవంబర్28,ప్రభాతవార్త :** సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహోన ్నత వ్యక్తి జ్యోతిరావుపూలే అని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జ్యోతిరావుపూలే 133 వ వర్ధంతి సందర్భంగా స్థానిక చీల్‌రోడ్డులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి టిడిపి ఆధ్వర్యంలో సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సమాజంలో నిస్సా ్యయకులుగా మిగిలిన సామాజిక వర్గాల కోసం పూలే పాటు పడ్డారన్నారు. అంటరాని తనం నిర్మూలన చేసిన సమాజిక విప్లవకారుడు పూలే అని అన్నారు. తన భార్య సావిత్రి బాయిపూలే ద్వారా నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను అక్షరాభ్యాసము ద్వారా చైతన్యం తెచ్చిన వ ్యక్తిఅని అన్నారు. తన జీవితాన్ని బడుగు, బలహీన వర్గాల కోసం అంకితంచేసిన గోప్ప సంఘ స ంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే అని అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనా తలవంచక దీక్షతో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అంకిత భావంతో పోరాడిన వ్యక్తి పూలే అన్నారు. విద్యద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యం అన్న మహాత్మా పూలే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్ళాలి ్సన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, విన్నకోట వీరయ్య నాయుడు, మందపాటి అంద్రేయ, కూచిపూడి శ్యామ్‌సుందర్, బూర్లె రామసుబ్బారావు, కృష్ణ, పరిశారమేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## స్పందన కార్యక్రమానికి 4అర్జీలు

**రేపల్లె, నవంబర్28,ప్రభాతవార్త:** ప్రజాసమస్యల సత్వరమే పరిష్కరించెందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం స ్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని రేపల్లె అర్డీవో పార్ధసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలోజరిగిన స్పందన కార్యక్రమానికి నాల్గు అర్జీలునమోదు అయినట్లు అయన తెలిపారు. ఈఅర్జీలను సంబందిత శాఖలకు పంపించి సత్వరమే పరిష్కారం అయే ్యలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిజేసారు.



## విద్యాభివృద్ధి కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త పూలే

**రేపల్లె, , నవంబర్28,ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర ్త పూలే అని పట్టణ వైసిపి అద్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలేవర్ధంతి సందర్భంగా ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అరి ్పంచారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ బడుగు బలహీన వర్గాల అశాజ్యోతిమహానీయులు పూలే అని సమాజంలో అసమానతలను పొగోట్టటంకోసం వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేసినమహోతన్నవ్యక్తి ఆ రోజుల్లో రాత్రిపూట బడులుపెట్టించి వారి శ్రీమతిద్వారా విద్య నేర్పించి న మహానీయుడు వితంతువులను అదుకున్నవ్యక్తి అలాంటి వ్యక్తి అశయాలను మనం ముందుకు తీసుకువెళ్లాలని బహుజనుల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టమంగా సుబ్బారావు, వైస్ చైర్మన్‌జి.ప్రశాంత్‌కుమార్, టికెవిగుప్తా, అల ంశెట్టి శ్రీనివాసరావు, వైసిపికౌన్సి లర్‌లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



## బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి

**కొల్లూరు, నవంబరు 28, ప్రభాతవార్త:** ఉద్యోగులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని అమృతలూరు సిడిపిఓ విజయలక్ష్మీ అన్నారు. సోమవారం ఎస్‌సి కమ్యూనిటీ హాలులో అంగన్‌వాడీ కార్యకర్తల శ్రీలత పదవి విరమణ సందర్భంగా కొల్లూరు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, సిడిపిఓ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శ్రీలతకు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులలో బాధ్యతగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ పరిధిలోని లబ్దిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో అంగన్‌వాడీ కేంద్రాలను సమస్యలను వివరించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మురాల రాంబాబు, వైసిపి నాయకులు కమ్మెల సాంబశివరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలత, నగరాజకుమారి, అపర్ణ, నీరజ, ఆదిలక్ష్మీ, వనత తదితరులు పాల్గొన్నారు.



## పేదల పెన్నిధి వంగవీటి మోహనరంగా

**- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** పేదల పెన్నిధి వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ప్రారంభించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో నూతనంగా వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారన్నారు. పేదల కోసమే ఆమరణ నిరాహారదీక్ష చేసే పరిస్థితుల్లో కొంత మంది దుండగులు హతమార్చడం దురదృష్టకరమన్నారు. వంగవీటి మోహనరంగా ఏ ఒక్క కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన పేదల కోసమే ఉద్యమించారన్నారు. ఎంతో మంది పేదలకు సహాయ సహకారాలు అందించి వారి మదిలో స్థానాన్ని సంపాదించారన్నారు. వంగవీటి మోహనరంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన సూచించిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని, ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, దేగల శ్రీరామమూర్తి, ఆకుల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామకృష్ణ, ఆకుల రామమోహన్, పల్లికల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉర్దూ ఘర్ అధ్యక్షుడిగా మహమూద్

**పొన్నూరు, నవంబర్ 28,ప్రభాతవార్త:** పట్టణంలోని ఎపిజె అబ్దుల్ కలామ్ ఉర్దూ ఘర్, షాదీఖానా అభివృద్ధి కమిటీని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రకటించారు. అందుకు సంబంధించిన పత్రాన్ని అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము) తహశీల్దార్ ఎస్.శ్రీకాంత్ కేదార్‌నాథ్‌కు అందజేశారు. పేద ముస్లింల అభివృద్ధికి ఉర్దూఘర్, షాదీఖానా సేవలను



వినియోగించుకొనేందుకు వీలుగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నిర్ణయం తీసుకొన్నారని అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము) చెప్పారు. ఉర్దూఘర్, షాదీఖానాను అంజుమన్ కమిటికి అప్పగించడం ద్వారా ముస్లీం పేదల అవసరాలకు అతి తక్కువ ఖర్చుతో ఉపయోగిస్తామన్నారు. షాదీఖానా అధ్యక్షుడిగా ఎంఎ మహమూద్, సభ్యులుగా షేక్ షర్మిల, షేక్ నయీంబాషా, జానిబాషా, షేక్ సలీమ్, షేక్ మహబుల్లా, షేక్ ఇసాక్, షేక్ వలిబాషా, షేక్ షౌకత్, సయ్యద్ జానిబాషా, షేక్ షకీల్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారికి పంపించారు. తహశీల్దార్ కార్యాలయంలో కూడా ఒక కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటి నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## ముస్లీం మహిళలకు క్షమాపణచెప్పాలి

**బాపట్లరూరల్, , నవంబర్28,ప్రభాతవార్త:** ముస్లీం మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ క్షమాపణలు చెప్పి పోలీసుల పై తగిన చర్యలు తీసుకోవాలని బాపట్ల పార్లమెంట్ టిడిపి ముస్లీం మైనార్టీ నాయకులు ఫరీద్ తెలిపారు. నరస్పాపురంలో జరిగిన సిఎం జగన్ బహిరంగ సభలో ముస్లీం మహిళలకు జరిగి అవమానానికి నిరసనగా సోమవారం ముస్లీం నాయకులు నిరసన, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక టిడిపి కార్యాలయం నుంచి ప్రారంభమై జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకుసాగింది. ఈ సందర్భంగా ముస్లీం మైనార్టీ నాయకులు ఫరీద్ మాట్లాడుతూ నరసాపురరంలో సిఎం బహిరంగ సభ ప్రాంగణం వద్ద ముస్లీ ్ల మహిళలను బురఖాలుతీసీ లోపలకి రావాలని పోలీసులు చెప్పడం బాధాకరంఅని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ప్రాధమిక హక్కులను అవహాసం చేస్తూ పోలీసులు వ్యవహరించినతీరు గర్హనీయమన్నారు. ఈ విధంగా ముస్లీం మహిళలను అవమానించడం మతాచారాలను మంట కల్పడం రాష్ట్ర మైనార్టీల దయనీయ పరిస్థితిని తెలియజేస్తుందన్నారు. సిఎం జగన్ ముస్లీం ల మీద చూపిస్తున్న కపట ప్రేమను అపి ముస్లీం మహిళలకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం నాయకులుపట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్రార్, పివిపాలెం మండల పార్టీ అధ్యక్షులు అబ్జల్ నాయకులు అబ్దుల్ మునాఫ్, షేక్ రజాక్, షేక్ బాజీ, షేఖ్ షాకా, సయ్యద్ రఫీ, షేక్ హుస్సేన్, షేక్ రసూల్, కరిముల్లా, సుభాని, తదితరులు పాల్గొన్నారు.



# తాము అధికారంలోకి వచ్చాకే వినుకొండలో అభివృద్ధి జరిగింది

### ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**వినుకొండ, నవంబర్28, ప్రభాతవార్త:** తాము అధికారంలోకి వచ్చాకే వినుకొండలో అభివృద్ధి జరిగిందని, వివక్ష లేకుండా అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని నీలగంగవరం గ్రామంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు .వైకాపాకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఓర్వలేక టీడీపీ నాయకులు జీ.వీ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న జీ.వీ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాతే నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరిగిందన్నారు. నీలగంగవరం గ్రామాభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 2.10కోట్లు నిధులు కేటాయించామని, సంక్షేమ పథకాల ద్వారా రూ. 11.43కోట్లు గ్రామంలోని లబ్ధిదారులకు అందించామని వివరించారు. అనంతరం గ్రామంలోని మిరప పంట పొలాలు పరిశీలించి తెగుళ్ళ నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో పిల్లలను కోల్పోయిన గ్రామానికి చెందిన రాయపూడి పెద్ద బాలగురవయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటరామిరెడ్డి, జెడ్పిటిసి రాజా, మండల వైకాపా కన్వీనర్ చెన్నయ్య, వినుకొండ సొసైటీ ప్రెసిడెంట్ నాసర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామతులసిరెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మిరప పంట తెగుళ్ళ నివారణపై రైతులకు అవగాహన

**వినుకొండ, నవంబర్28, ప్రభాతవార్త:** మండలంలోని నీలగంగవరం గ్రామంలో మిరప పంటలను ఉద్యాన అధికారి షేక్ నబి రసూల్ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మిరపను ఆశించే తెగుళ్ళపై రైతులకు అవగాహన కల్పించారు. తెల్లనల్లి నివారణకు డైఫెన్థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమైసిఫెన్ 1 మి.లి లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. తెల్లదోమ నివారణకు ఎకరంకు 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను పొలంలో అమర్చాలన్నారు. తామర పురుగు నివారణకు సైయాన్ట్రనిలిప్రోల్ 240 మి.లీ. ఒక ఎకరానికి లేదా ఇమిడా క్లోప్రిడ్ 40 శాతం, ఫెప్రొనిల్ 40 శాతం 50 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే కొమ్మ ఎండు, కాయకుళ్ళు నివారణకు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.



# కవి కరిముల్లాకు కళామిత్ర ప్రతిభా పురస్కారం

**వినుకొండ, నవంబర్28, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన ప్రముఖ కవి కరిముల్లాకు ఒంగోలు కళామిత్ర మండలి వారు కళామిత్ర ప్రతిభా పురస్కారం అందజేశారు. తెలుగు సాహిత్యానికి కరిముల్లా అందించిన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేయడం జరిగింది. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, జీ.వి పూర్ణచంద్, భూసురపల్లి వెంకటేశ్వర్లు, కళామిత్రమండలి వ్యవస్థాపకులు నూనె అంకమ్మరావు, తేళ్ళ అరుణ తదితరులు కరిముల్లాను ఘనంగా సన్మానించారు.



# మాలధారణ స్వాములకు సద్ధి వితరణ

**వినుకొండ, నవంబర్28, ప్రభాతవార్త:** పట్టణంలోని పాత శివాలయంలోని మాలధారణ స్వాములకు పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు పి. మహబూబ్‌ఖాన్, ఎస్.కె రఫీ, ఎస్.కె బాష, ఎస్.కె అత్తర్‌నాగర్‌ల ఆధ్వర్యంలో సద్ధి వితరణ (అన్నదానం) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వయంగా స్వాములకు సద్ది వడ్డించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతిరావుపూలేకు ఘననివాళి

**నాదెండ్ల, నవంబర్28, ప్రభాతవార్త:** మండలంలోని నాదెండ్ల యంపిడిఓ కార్యాలయంలో సోమవారం సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి యంపిడిఓ జాకీర్‌హుస్సేన్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# పల్నాడు జిల్లా వార్త



పెదకూరపాడు, గురజాల , మాచర్ల , చిలకలూరిపేట , నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి,

# పూలే ఆశయ స్ఫూర్తితోనే నాడు బిసిలకు 20శాతం రిజర్వేషన్ కల్పించిన కాసు బ్రహ్మానందరెడ్డి

### -జ్యోతిరావు పూలే వర్ధంతి సభలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

**పిడుగురాళ్ళ, నవంబర్ 28, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి వేడుకలను సోమవారం వైఎస్సార్సీపీ బడుగు బలహీన వర్గాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్ములు మార్గదర్శకులు మహాత్మ జ్యోతిరావు పూలే లాంటివారి పోరాటం వల్లే సువిశాలమైన భారతదేశం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. దేశంలో గతంలో వెనుకబాటుతనం అంటరానితనం కులాలు ఏర్పాటువాదం ఉండేదని వాటన్నింటినీ రూపుమాపేందుకు జ్యోతిరావు పూలే లాంటివారు ఎంతో పోరాటం చేశారని, వారి పోరాటం వల్లే మనుషులంతా ఒకటేగా, అంటరానితనం రూపుమాపి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. అంబేద్కర్ లాంటి మహానుభావులు రచించిన రాజ్యాంగం బడుగు బలహీనవర్గాలకు అనేక రకాల హక్కులు కల్పించడంతో బలహీన వర్గాల వెనుకబాటుతనం రూపుమారిందన్నారు. వారి ఆదర్శాల స్ఫూర్తితో కాసు బ్రహ్మానందరెడ్డి 1970లో జీవో తీసుకొచ్చి బీసిలకు 20శాతం రిజర్వేషన్‌ను ఆనాడు కల్పించారన్నారు. దాంతో నేడు ఏ ప్రభుత్వం మారినా రిజర్వేషన్లు జనాభా ప్రాతిపతికన పెంచుతూ బీసిల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఆనాడు కాసు బ్రహ్మానందరెడ్డి బీసి రిజర్వేషన్లతో 90కులాలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, దానిలో భాగమే నియోజకవర్గంలో వెనుకబడిన మాచవరం, దాచేపల్లి మండలాలలో రాష్ట్ర ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సర్వే కోసం 50లక్షలు మంజూరు చేసిందన్నారు. అడిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు మంజూరు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇది వెంటనే సర్వే చేస్తే రిపోర్టు పంపితే సంవత్సరకాలంలో లిఫ్టు ఇరిగేషన్ పూర్తి చేయడం జరుగుతుందని చిట్టచివరి భూములకు నీరు అందిస్తే పలనాడు ఎంతో సస్యశ్యామలంగా వుంటుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పిడుగురాళ్ల మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణపార్టీ అధ్యక్షులు చింత వెంకట రామారావు ,రాష్ట్ర బిసిసెల్ కన్వినర్ కుందుర్తి గురువాచారి ,కొమర వెంకటేశ్వర్లు, బిసి కార్పోరేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాసు మహేష్‌రెడ్డి తదితరులు

# పేదవిద్యార్థులకు ఆర్థికసాయం

**పిడుగురాళ్ళ, నవంబర్ 28, ప్రభాతవార్త:** విద్యను అభ్యసించడానికి స్తోమత లేక ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు నేనున్నాను అంటూ ఎస్‌విఎన్ మరియు ఎంఎన్ కంపెనీల అధినేత ప్రదీప్ ఎంతో మంది పేద విద్యార్థులకు చదువులకు ఆర్థికసహాయం అందిస్తూ తన మంచి మనసును చాటుతున్నారు. గతంలో కూడా ఎంతో మంది పేద విద్యార్థులకు వృద్ధులకు తనకు చేతనైన సహాయాన్ని అందిస్తూ అదే స్ఫూర్తితో సోమవారం జానపాడు గ్రామంలోని కృపాసన చర్చికి 1లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ తన్ను దేవుడు ఉన్నత స్థితిలో ఉంచారని అందుకే ఆ దేవుడికి ఎల్లవేళలా రుణపడి వుంటానని అందుకే పేద విద్యార్థులకు చేతనైన ఆర్థిక సహాయం అందజేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి కోటేశ్వరరావు, కోల్డ్ స్టోరేజ్ డైరక్టర్ వెంకట్రావ్, నిర్మలబాబు, లతీఫ్‌తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక తనిఖీ గ్రామసభ

**మాచర్ల, నవంబరు 28 ప్రభాతవార్త:** ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం మండలంలోని కంభంపాడు సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన పనులపై వివరించారు. ఈ గ్రామసభలో ఎంపీడీవో సురేష్ విజయ్‌కుమార్, సర్పంచ్ యశోదమ్మ, ఎంపీటీసీ అచ్చమ్మ, కార్యదర్శి బిట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# పట్టణంలో మహాత్మా జ్యోతిరావుపూలేకు ఘననివాళులు

**చిలకలూరిపేట, నవంబర్28, ప్రభాతవార్త:** పట్టణంలో పలుపార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాలలో, పట్టణంలోని కెబి రోడ్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బిసి సెల్ అధ్యక్షుడు తన్నీరు పుల్లారావు, కార్యదర్శి యం వెంకట శివరాం ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నందమూరి తారకరామారావు విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో జంగా వినాయకరావు, షేక్ అజారుద్దిన్, షేక్ జానీభాష, షేక్ జాకీర్, షేక్ అబ్దుల్ భాష, షేక్ కరిముల్లా, గంగాధర్, గోపిదేశి ప్రసాద్, యం శేఖర్, పూర్ణసింగ్, మాధవ్‌సింగ్, ఉదయ శంకర్‌సింగ్ తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, జరీనాసుల్తానా, మద్దిబోయిన శివ, తుపాకుల అప్పారావు, కంచర్ల శ్రీనివాసరావు, కొండా వీరయ్య, పఠాన్ సమద్‌ఖాన్, జంజనం వెంకటేశ్వరరావు, గాలం కోటేశ్వరరావు, మారుబోయిన శ్రీనివాసరావు, నిమ్మకాయల ప్రసాద్, గుమ్మా ప్రసాద్‌లు పాల్గొని ప్రసంగించారు.

వైయస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మహాత్మాజ్యోతిరావుపూలే చిత్రపటానికి పార్టీ నాయకులు విడదల గోపీ, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, నాదెండ్ల జడ్‌పిటిసి కాట్రగడ్డ మస్తాన్, ముస్లిం మైనారిటి అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, వైసిపి కౌన్సిలర్లు, వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కెబి రోడ్‌లో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విడదల గోపి, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మద్దిరాల విశ్వనాథం, మాజీ ఛైర్మన్ బొల్లెద్దు చిన్నా, ముస్లిం మైనారిటి కార్పోరేషన్ డైరక్టర్ షేక్ దరియావలి, వైసిపి కౌన్సిలర్లు, వివిధ సొసైటిల అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొని నివాళులుఅర్పించారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో కెబి రోడ్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రబాయి పూలే విగ్రహాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజరమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పఠాన్ ఖాదర్‌భాష, మునీర్‌హసన్, అచ్చుకోల బ్రహ్మస్వాములు, వెంకటస్వామి, లీలాకిషోర్, స్టీల్ అంజి, జానీభాష, మోహన్, అయ్యప్పస్వామి నాయుడు, అప్రోజ్, పెద్దింటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాజ్యోతిరావుపూలే చైతన్యసేవా సంఘం ఆధ్వర్యంలో కెబిరోడ్‌లో ఉన్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు సంఘ అధ్యక్షుడు ఉప్పాలభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి మారుబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి తుపాకుల అప్పారావు, గౌరవ అధ్యక్షుడు గోరంట్లనారాయణరావు, సంఘ నాయకులు వంకదారి పుల్లయ్య, గుంజి పద్మ, ఉప్పాల మహేశ్వరరావు, కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావులు పాల్గొని పూలమాలలు వేసినివాళులు అర్పించారు.

తహసిలార్ధర్ కార్యాలయంలో తహసిల్దార్ జి సుజాత మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోడిప్యూటి తహసిల్దార్ రవికుమార్, ఆర్ఐ జిలాని, విఆర్‌ఒలు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు. బిసి సంక్షేమ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నియోజకవర్గ అధ్యక్షుడు కాకుమాను రమేష్, సంఘ నాయులు బెల్లంకొండ రూపేష్ కుమార్ గౌడ్, షేక్ సింగరయ్య, గొట్టం నాగేశ్వరరావు, బి శివకోటేశ్వరరావు, గుంజి పద్మావతి, దాసరి శ్రీనివాసరావు, దన్నవరపు కోటేశ్వరరావు, జంజనం వెంకట్రావు, కె వీరాంజనేయులు, ఓంకార్ తదితర నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి యం రాధాకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఉప్పుటూరి అనీల్‌కుమార్, పార్టీ నాయకులు శంకరరావు, రత్తయ్య, హనుమయ్య, సుందరబాబు, వెంకటేశ్వరుల , అహ్మద్, కొండలు, షేక్ నసిరుద్దిన్, యం ప్రసన్నకుమార్, వెంకటరత్నం, ఆదినారాయణ, మురళి, రాజా, పెదలంక వెంకటేశ్వర్లు, కోటయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. బిజెపి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఓబిసి మోర్చాజిల్లా ప్రదాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యలయంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. జాతీయ బిసి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కెబి రోడ్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు సంఘం అధ్యక్షుడు మాదాసు పృధ్వీరాజ్ సాయి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాచపూడి వెంకట్, పెద్దవరపు నరసింహరావు, సాయితేజ, సతీష్, వీరనారాయణ, అనిల్, సుభానీలు పాల్గొని నివాళులు అర్పించారు.









# వైకాపా నాయకుల వ్యాఖ్యలను ఖండించిన టిడిపి

**రొంపిచర్ల, నవంబర్ 28 ప్రభాతవార్త :** వైకాపా నాయకులు వ్యవహరిస్తున్న తీరు అధ్వాన్నంగా ఉందని వారి మాటలు ముస్లిం మహిళలను అవమానించే విధంగా ఉన్నాయన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడారు. మాజీ సిఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌పై అణుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సోదరునిపై ఎస్పీకి ఫిర్యాదు చేశామని డాక్టర్ అరవింద్‌బాబు తెలిపారు. ఒళ్ళు దగ్గర పెట్టుకొని వైకాపా నాయకులు మాట్లాడాలని హెచ్చరించారు. అధికారం ఎల్లప్పుడు ఒకరికి శాశ్వితం కాదని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో పోలీసుల పద్ధతి మారకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని డాక్టర్ అరవింద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయశ్రీ, శ్రీనివాసరావు, మారుతీ, వెంకట్రావు, రఫీ పాల్గొన్నారు.



# పూలే జీవితం యువతకు ఆదర్శం

### : ఎమ్మెల్యే గోపిరెడ్డి

**రొంపిచర్ల, నవంబర్ 28 ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిరావుపూలే జీవితం యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ బిసిల కోసం వైఎస్సార్ సీపీ ఎంతో పాటు పడుతుందన్నారు. విద్య కోసం ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలో 122 మంది బిసిలను వివిధ కార్పోరేషన్‌లలో డైరెక్టర్లుగా నియమించారని తెలిపారు. బిసిలకు పూర్తిగా వైకాపా అండగా నిలుస్తుందన్నారు. సావిత్రిబాయి విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేస్తామన ఎమ్మెల్యే గోపిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మిట్టపల్లి రమేష్, ఇ.ఎం.స్వామి, బోయిన సుబ్బారావు, అచ్చి శివకోటి తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణవేణి డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం

**నకరికల్లు, నవంబర్ 28 ప్రభాతవార్త :** కృష్ణవేణి డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చిలకలూరిపేటరోడ్డులోని బైపాస్ జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంగం డైరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర పాల్గొని నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రి, గురువుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. క్రమశిక్షణతో సమాజానికి ఉపయోగపడాలన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో నేటి విద్యా విధానానికి అనుగుణంగా అధునాతన ల్యాబ్‌లు, సౌకర్యాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కె.నాసరయ్య, ఎం.శేషగిరిరావు, పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



# సినీనటి గీతాసింగ్‌కు అవార్డు ప్రధానం

**నకరికల్లు, నవంబర్ 28 ప్రభాతవార్త :** సినీనటి గీతాసింగ్‌కు విశ్వజనని ఫౌండేషన్ ఛైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం అవార్డును ప్రధానం చేశారు. జాతీయ సేవా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. తిరుమల తిరుమల దేవస్థాన కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదనాచారి, సునీతారెడ్డి, రాజంబాబు, లక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అవార్డు గ్రహీత గీతాసింగ్ మాట్లాడుతూ విశ్వజనని ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎఎంజి డైరెక్టర్ డాక్టర్ మహంతి అభినందన

**చిలకలూరిపేట, నవంబర్28, ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన పోటీలలో ఎయంజి పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. అండర్17 చెస్ విభాగంలో వి మౌనిక, సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో కరుణ్‌తేజ, కళ్యాణ్‌నాయక్, వెంకటేశ్వర్లు ఎంపిక అయ్యారు. బాలికల విభాగంలో దుర్గాభవాని, తన్మయి, స్రవంతి, ప్రణతి ఎంపిక అయ్యారు. అండర్ 17 బేస్‌బాల్ బాలుర విభాగంలో వెంకటనారాయణ, ముని నాయక్ ఎంపికఅయ్యారు. బాలికల విభాగంలో నాగపావని, కిట్టు, మహిలు ఎంపిక అయ్యారు. అండర్ 14 బేస్‌బాల్ బాలుర విభాగంలో మురళికృష్ణ నాయక్, బాలికల విభాగంలో సంజన, రవళిక, భవాని, మహలక్ష్మిలు ఎంపిక అయ్యారు. వీరందరిని సోమవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎయంజి డైరక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ కంటి మహంతి అభినందించారు. వీరితోపాటు ఎయంజి సిఎఒ మాశిలామణి, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, ఉమ్మడిగుంటూరు జిల్లా కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, ఎయంజి హైస్కూల్ హెచ్‌యం మేరి, ప్రాథమిక పాఠశాల హెచ్ యం కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్‌పాఠశాలల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు.



# డాక్టర్ కృష్ణమోహన్‌కు పురస్కారం

**చిలకలూరిపేట, నవంబర్28, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన దంతవైద్య నిపుణలు పేర్ని కృష్ణమోహన్‌కు రాష్ట్ర స్థాయి ఓరల్ హెల్త్ యాక్టివిటిస్ పురస్కారం లభించింది. విశాఖ పట్టణంలో ఆదివారం జరిగిన రాష్ట్ర డెంట్ అసోసియేషన్ సదస్సులో ఈ పురస్కారాన్ని రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గోరంట్ల సతీష్, డాక్టర్ కె అజయ్ బెనర్జి ప్రధానం చేశారు. గత 22 సంవత్సరాలుగా బాలదంత సురక్ష కార్యక్రమంలో బాగంగా డాక్టర్ కృష్ణమోహన్ రెండువేలకు పైగా ఉచిత శిబిరాల ను నిర్వహించి రాష్ట్ర స్థాయిలో ప్రధమ స్థానంలో నిలిచారని రాష్ట్ర నాయకలు ప్రసంశించారు. పుగాకు ఉత్పత్తులు వలన వచ్చే ప్రమాదాలను, తద్వార క్యాన్సర్ వ్యాధి తీవ్రతపై డాక్టర్ కృష్ణమోహన్ వైద్య శిబిరాల ద్వారా ప్రచారం చేయాలని రాష్ట్ర నాయకులు కోరారు. డాక్టర్ కృష్ణమోహన్‌ను మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ధనలక్ష్మీ గ్రూప్ సంస్థల డైరక్టర్ పేర్ని వీరనారాయణ, రాష్ట్ర డెంట్ అసోసియేషన్ నాయకులు బిట్రా శ్రీధర్, లింగమనేని కృష్ణ ప్రసాద్, డాక్టర్ సాయిశంకర్, డాక్టర్ కడియాల కృష్ణకిషోర్, డాక్టర్ బొల్లా నగేష్, డాక్టర్ కె శివన్నారాయణ, డాక్టర్ సిహెచ్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు అభినందిచారు.



## ఎడ్జ్ డిటెక్టర్‌కు రూపకల్పన చేసిన 'న్యూటన్స్' విద్యార్థులు

**మాచర్ల, నవంబరు 28 ప్రభాతవార్త:** మాచర్ల మండలం అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా విద్యార్థులు ఎడ్జ్ డిటెక్టర్‌ను రూపొందించారు. సోమవారం దీనిపై వారు మాట్లాడారు. తమ ప్రాజెక్ట్ వర్కులో భాగంగా దీన్ని రూపొందించామన్నారు. ప్రధానంగా ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీన్ని ఏ వాహనంలోనైనా అమర్చుకోవచ్చన్నారు. మలుపుల వద్ద వాహనం మార్జిన్ దాటుతుంటే ఈ యంత్రం ద్వారా వాహనం ఆటోమేటిక్ టర్న్ అవుతుందని చెప్పారు. ఈ యంత్రాన్ని రూపొందించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, సందీప్‌రెడ్డి, సీతారామిరెడ్డిలు అభినందించారు.




## ఎస్టీయూ రాష్ట్ర సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా నరసింహారావు

**మాచర్ల, నవంబరు 28:** ఎస్టీయూ రాష్ట్ర సాంస్కృతిక కమిటి కన్వీనర్‌గా మాచర్ల మండలానికి చెందిన ఉపాధ్యాయుడు పల్చూరి నరసింహారావు ఎన్నికయ్యారు. ఈయనతోపాటు ప్రచార కమిటి కన్వీనర్‌గా కొమ్ము కిషోర్, సోషల్ మీడియా కమిటి మెంబర్‌గా బాలునాయక్ ఎన్నికైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు తెలిపారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఉపాధ్యాయులు వారిని అభినందించారు.



## పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

**మాచర్ల క్రైం, నవంబరు 28 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించినా కాలం కలిసిరాలేదు. అకాల వర్షాలకు తోడు తెగుళ్ల సోకి పంట నాశనమైంది. ఈయేడాదైనా కలిసిరాకపోతుందా అని ఐదేళ్లుగా ఎదురుచూశాడు. అయినప్పటికీ నిరాశే మిగిలింది. ఈ యేడు కూడా పంట చేతికి రాకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పంటను కాపాడుతుందని తెచ్చిన పురుగుమందు ఆ రైతు ప్రాణం తీసింది. ఈ సంఘటన మాచర్ల మండలం రాయవరంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయవరం గ్రామానికి చెందిన జగడాల మల్లికార్జునరావు (40) వ్యవసాయం చేస్తూ జీవిస్తుంటాడు. నాలుగేళ్లుగా గ్రామంలో రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని సాగు చేశాడు. అయితే పంటలు సరిగా పండకపోవడంతో అప్పులపాలయ్యాడు. సుమారు రూ. 5 లక్షల దాకా అప్పులు పేరుకుపోయాయి. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో సోమవారం తన ఇంట్లోనే పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని కుటుంబసభ్యులు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్థారించారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.



## జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగించాలి

**: టౌన్ సీఐ బాలకృష్ణ**

**మాచర్ల, నవంబరు 28 ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగించాలని పట్టణ సీఐ బాలకృష్ణ అన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యాన సోమవారం పట్టణంలో జ్యోతిరావుపూలే వర్థంతిని ఘనంగా నిర్వహించారు. పార్కు సెంటర్లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని మరవలేమన్నారు. యువత పూలేను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ సైదులు, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, శ్యాంసుందరాచారి, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.



## వాహనం నుంచి మంటలు-దహనం

**: త్రుటిలో తప్పిన ప్రమాదం**

**విజయపురిసౌత్, నవంబరు 28 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనంపై ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధం కాగా వాహన చోదకుడు త్రుటితో తప్పించుకొని ప్రాణాలతో బయటపడిన సంఘటన మండలంలోని బొయ్యారం వద్ద చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని చింతలతండాకు చెందిన కేతావత్ తారాసింగ్ తన ది ్వచక్రవాహనం స్టార్టింగ్ సమస్య ఉండడంతో చూపించుకునేందుకు మాచర్ల పట్టణానికి వచ్చాడు. పట్టణంలోని ఓ ప్రముఖ షోరూంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇచ్చి మరమ్మతులు చేయమన్నారు. ఇందుకు షోరూం ప్రతినిధులు రూ. 1500 వరకు తీసుకొని మరమ్మతులు చేశారు. తారాసింగ్ తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. మండలంలోని తాళ్లపల్లి కుడి కాలువ కట్ట మీదుగా వస్తుండగా మధ్యలో మూడుసార్లు వాహనం నిలిచిపోయింది. కాగా జీవాలు ఎదురుగా రావడంతో వాహనం స్పీడ్ తగ్గించే ప్రయత్నం చేయగా మరోమారు బైకు ఆగిపోయింది. జీవాలు వెళ్లగానే తిరిగి బండిని స్టాట్ చేసేందుకు కిక్ కొట్టగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన తారాసింగ్ వాహనాన్ని వదిలి ముందుకు ఉరికి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు తారాసింగ్ కోరారు.



## అనారోగ్య కారణాలతో చైర్మన్ పదవికి రాజీనామా చేసిన దాచేపల్లి నగరపంచాయితీ చైర్మన్ మునగా రమాదేవి

**దాచేపల్లి, నవంబర్ 29, ప్రభాతవార్త:** దాచేపల్లి నగర పంచాయితీ ఏర్పడ్డ మొట్టమొదటి మహిళా చైర్మన్ మునగా రమాదేవి తన చైర్మన పదవికి తనపదవికి రాజీనామా వేసారని కమీషనర్ అనిశెట్టి శ్రీవిద్య సోమవారం తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చైర్మన్ మునగా రమాదేవి సోమవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రాజీనామాను అందరూ ఆమోదం తెలిపియున్నారని వారు రాజీనామా చేయడం బాధకరమని,భగవంతుడు ఆమెను త్వరలో కోలుకోవాలని కోరుకున్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న చైర్మన్ మునగా రమావేవిని శాసనసభ్యులు కాసుమహేష్‌రెడ్డి పరామర్శించడం జరిగింది.



## విద్యార్థులకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ అందజేత

**పెదకూరపాడు, నవంబర్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గుంటూరు జిల్లా పరిషత్ వారిచే సరఫరా చేయబడిన జగనన్న విద్యాజ్యోతి (స్టడీ మెటీరియల్) ను వైకాపా నియోజకవర్గ నాయకులు కంకణాల శివాజీ, మండల విద్యాశాఖాధికారి ఏకుల ప్రసాదరావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులగుటకు, మంచి మార్కులు పొందుటకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు అదనంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు వి.చంద్రశేఖరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి కరాటే పోటీలలో పతకాలు సాధించిన మదర్ థెరిస్సా విద్యార్థులు

**దాచేపల్లి, నవంబర్ 29, ప్రభాతవార్త:** 27వ తేదిన హైదరాబాదునందు సమన్ సుటోకాన్ స్పోర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో మదర్ థెరిస్సా ఇంగ్లీస్ మీడియం,జె.పి గ్రూప్ దాచేపల్లి స్కాలర్స్ విద్యర్దులు 3బంగారు, 3రజిత,ఆరు కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా యాక్టర్ సుమన్ తల్వార్ మరియు నర్రా లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.మదర్ థెరిస్సాకు చెందని విద్యార్దులు జూనియర్ విభాగంలో గుండా ధన్వంతరి,ఏ.సాయికిషోర్,కె.గౌతం,పి.గౌతమ్,జి.రామ్‌చరణ్,యస్‌కే.యండి,సాజిద్‌లు,సీనియర్ కటాష్ విభాగంలో వి.మహేష్,కె.అవినాష్,బి.రాజేష్,పి.వివేక్,యల్.వి.గణేష్,కె.కార్తీక్,కె.సాయిగిరిధర్‌లు బంగారు పతకాలు సాధించారు.విజేతలైన విరిని పాఠశాల యాజమాన్యం,ఏ.నవకుమార్, ఏ.చంద్రశేఖర్,కారాటే కోచ్ జి.మల్లిఖార్జునరావు,కె.సతీష్‌కుమార్,మరియు విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ చిన్నారులను పరీక్షించిన డాక్టర్ చైతన్య

**పెదకూరపాడు, నవంబర్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎనిమిదవ అంగన్‌వాడీ సెంటర్‌ను 108 సిబ్బంది డాక్టర్ లిఖిత, సి.హెచ్.డాక్టర్ చైతన్యలు సోమవారం అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. చిన్నారులకు ప్రతి రోజూ గుడ్డుతో పాటు పాలు అందించాలని, ఆకుకూరలతో ఆహారం పెట్టాలని డాక్టతర్ చైతన్య అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త స్రవంతి, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



## దాయాదుల మధ్య వర్గ పోరు...ఇద్దరికీ తీవ్ర గాయాలు

**బెల్లంకొండ, నవంబర్ 28 ప్రభాతవార్త :** ఇరువురి దాయాదుల మధ్య గొడవ తీవ్ర రూపం దాల్చి ఓ ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్.ఐ. ఎల్.సుధీర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడవటి జ్యోతి, కొడవటి రమేష్, కొడవటి శశి ముగ్గురు క్రీమ్ బండ్లు వేసుకొని ఐస్ క్రీమ్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజు ఐస్‌క్రీమ్ బండి తో ఐస్‌క్రీమ్ అమ్ముకోవడానికి వెళ్తున్నప్పుడల్లా కొడవటి రమేస్ పెదనాన్న అయిన కొడవటి గంగులు ప్రతి రోజు వీరిని చూస్తూ రకరకాలుగా కామెంట్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుంటే ఎందుకు మా గురించి అలా మాట్లాడతావు అని అడగటానికి వెళ్ళిన రమేష్, జ్యోతిలపై కొడవటి సాగర్, కొడవటి సురేష్, కొడవటి భూషణం ముగ్గురు కలిసి ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి గాయపరచగా కొడవటి జ్యోతికి తలపై తీవ్ర గాయం కాగా రమేష్‌కు తలపై, వీపు భాగాన గాయాలయ్యాయి. గాయపరిచిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. సుధీర్‌బాబు తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావుపూలే 132వ వర్ధంతి

**అచ్చంపేట, నవంబర్ 28 ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావుపూలే 132వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి ట్రస్ట్ ఛైర్మన్, వైకాపా మండల అధ్యక్షులు చిలుకా చంద్రయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరిగ్గా 132 సంవత్సరాల క్రితమే సమాజంలో ఉన్నటువంటి బలహీనతలను, అంటరానితనానికి వ్యతిరేకంగా పని చేసి సమాజాన్ని ముందుకు నడిపించినటువంటి మహనీయుడు మహాత్మ జ్యోతిరావుపూలే అని కొనియాడారు. సమాజంలోని కుల వ్యవస్థను, అట్టడుగు పొరల్లో ఉన్న ప్రజానీకాన్ని ముందుకు నడిపించేందుకు పాఠశాలలు స్థాపించి మహిళల విద్యాభివృద్ధికి జీవితాంతం పాటుపడిన మహనీయుడు పూలే అని అన్నారు. ఆనాడు బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుక్య రజిని కృష్ణ నాయక్, సికా నరసింహారావు, తిరువాయిపాటి ఆంజనేయులు సలికేటి సింహరాయలు, సందెపు సంసోన్, ఇమ్మానుయేలు, వేమవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలేకు ఘననివాళి

**సత్తెనపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్యాన్‌రాజ్‌పాల్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే 132వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తాలూకా సెంటర్‌లోని ఆయన విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్క చంద్రపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా పూలే జీవిత చరిత్రని, ఆశయాలని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు దాసరి జ్యాన్‌రాజ్‌పాల్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి పోరాట యోధులు మహాత్మ జ్యోతిరావుపూలే అని అన్నారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే కూడా ఆయన అడుగుజాడల్లో నడిచి భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, తుమ్మలగుంట్ల రామకృష్ణ, ఏఐటియుసి అధ్యక్షులు కంభాల శ్రీనివాసరావు, సేవాదళ్ నాయకులు సిద్ధల మోహన్‌రావు, ముప్పాళ్ళ మండలం నాయకులు కోట ఆనంద్, జెట్టి శేఖర్‌బాబు, అంబేద్కర్, యువజన సంఘం నాయకులు జిల్లెల పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



## 'తోపుదుర్తి' నోరు అదుపులో పెట్టుకోవాలి

**: తెదేపా నేతల హెచ్చరిక**

**సత్తెనపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త :** తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లపై తోపుదుర్తి చంద్రశేఖరరెడ్డి చేసిన వ్యాఖ్యలను టిడిపి నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. చంద్రబాబునాయుడు పర్యటనకు వస్తున్న అపూర్వ ప్రజా ఆదరణ చూసి, నారా లోకేష్ సుదీర్ఘ పాదయాత్ర చూసి వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో సహా పార్టీ మొత్తం గజగజా వణుకుతుందన్నారు. పరిటాల రవి హత్య వెనుక వై.ఎస్.జగన్ హస్తం ఉందని నిండు




అసెంబ్లీలో టిడిపి నాయకులు అడిగిన ప్రశ్నకు సమాధానాన్ని దాటవేయమని ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వై.ఎస్.రాజశేఖరరెడ్డి సభాపతిగా ఉన్న నల్లారి కిరణ్‌కుమార్‌తో చెప్పారని చెప్పినమాట తోపుదుర్తి వ్యాఖ్యలతో స్పష్టమైందని ఆరోపించారు. పరిటాల హత్య వెనుక, ఆ హత్యతో సంబంధం ఉన్న అందరిని హత్య చేయించింది నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతోనే నేటి ముఖ్యమంత్ర వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేయించినట్లు తోపుదుర్తి వ్యాఖ్యలతో రా ష్ట్ర ప్రజానీకానికి అర్థమయ్యిందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడమే వైకాపా ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధిచెప్తారని టిడిపి నాయకులు హెచ్చరించారు. సమావేశంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద్ద కరిముల్లా, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, సత్తెనపల్లి పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వరరావు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.అబ్దుల్లా, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మాజీ డైరెక్టర్ రాంబో బుడే, షేక్.ముస్తఫా, బండారు నాగరాజు, షేక్.టైలర్ సైదా, దేవళ్ళ జగన్నాథం, షేక్.నాగులు, నూర్‌బాషా సైదులు, షేక్.మీరాహుస్సేన్, కొమ్మినేని సాంబయ్య, పురుషోత్తం నాయక్, గాలి ఆంజనేయులు, నూర్‌బాషా భాష, షేక్.లాలబుడే తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల సమగ్ర అభివృద్ధికి కృషి: మంత్రి 'అంబటి'

**- 'గడప-గడపకు మన ప్రభుత్వం'లో 340 కుటుంబాలతో మాటామంతీ**

**సత్తెనపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త :** అన్ని వర్గాల సంక్షేమంతో పాటు పల్లెలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర జలవనరులశాఖామంత్రి అంబటి రాంబాబు అన్నారు. వెన్నాదేవిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను అందించారు. సోమవారం ఆయన 340 కుటుంబాలను సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల సేవలను ఆరా తీశారు. కాపు నేస్తం అందుతుందా, అమ్మఒడి మీ ఖాతాలో జమ అయ్యిందా, పెన్షన్ వస్తుందా, సకాలంలో వాలంటీర్లు సేవలందిస్తున్నారా, సచివాలయ వ్యవస్థ ఎలా ఉంది, గ్రామంలో మీకు ఏమైనా పనులు కావాలా అని అడిగి తెలుసుకొని వారి సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నారు. స్థానికుల నుంచి సి.సి.రోడ్లు, విద్యుత్ స్తంభాలు, మరుగు కాల్వల నిర్మాణానికి వినతులు రాగా సచివాలయానికి వచ్చే రూ.20 లక్షల నిధులతో గ్రామంలో శాశ్వతవనరుల కల్పన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టి కృషితో గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక నిధి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి ఇస్తున్న రూ.20 లక్షలతో శాశ్వత అభివృద్ధి పనులు, వసతుల కల్పనకు అంచనాలు వేయిస్తున్నామని ఆయన అన్నారు. కార ్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ చెరుకూరి వన్నూరు, ఎంపిటిసి సభ్యురాలు నిత్యా ప్రియదర్శిని, గొడుగుల సుబాఋబ్బరావు, మాదంశెట్టి వేదాద్రి, రవి, ఎంపిడిఓ సత్యనారాయణ, పలుశాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## 'ఆరోగ్యశ్రీ'ద్వారా మరో అరుదైన శస్త్రచికిత్స

**- 'ఆరోగ్యశ్రీ' పేదలపాలిట వరం :వైద్యులు రాజమోహన్‌రెడ్డి, గీతా హాసంతి**

**సత్తెనపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త :** ఆరు నెలలుగా తొంటి నొప్పితో ఇబ్బంది పడుతూ పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగి వైద్యం చేయాలంటే తొంటి మార్పిడి జరగాలని, దానికి లక్షలు ఖర్చు అవుతుందని తెలుసుకున్న చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన రాములమ్మ అనే వృద్ధురాలికి సత్తెనపల్లిలో ఉచితంగా తొంటి మార్పిడి చేశామని గీతా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు రాజమోహన్‌రెడ్డి, గీతా హాసంతిలు అన్నారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సల సంఖ్యను 3255 కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని వాటిల్లో ఈ తొంటి మార్పిడి చికిత్స కూడా ఉందన్నారు. దరఖాస్తు చేసిన 24 గంటల్లో అనుమతి వచ్చిందని తెలిపారు. దీంతో రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయ్యే వైద్యాన్ని రాములమ్మకు ఉచితంగా సర్జరీ చేశామని ఇది పల్నాడులో ఆరోగ్యశ్రీ కింద చేసిన మొట్టమొదటి కేసుగా అభిప్రాయపడ్డారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. అన్ని రకాల ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ కింద తమ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు ఒక వరం అంటూ కొనియాడారు.



## పాటిబండ్లలో తెదేపా పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**పెదకూరపాడు, నవంబర్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామంలో బూత్ లెవల్ కమిటీ సమావేశం మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటిబండ్ల గ్రామంలో తెదేపా బలోపేతానికి వార్డు స్థాయి నుంచి కమిటీ సభ్యులు పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, మద్దిరాల గంగాధర్, షేక్.ముంతాజ్, గంగినేని లీలావతి, షేక్.అజుముల్లా, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, పాటిబండ్ల శివమ్మ, నెల్లూరి మల్లికార్జునరావు, మక్కెన సాగర్, మద్దినేని సత్యం, జారాత్నం, పాటిబండ్ల బాలయ్య, కోరంపల్లి నరేంద్ర, రమేష్, శేఖర్, క్రీస్తు, రాజు తదితరులు పాల్గొన్నారు.



## బైక్ దొంగ అరెస్ట్...ఐదు బైకులు స్వాధీనం

**అమరావతి, నవంబర్ 28 ప్రభాతవార్త :** బైకుల చోరీలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఐదు బైకులను సర్కిల్ కేంద్రమైన అమరావతిలో సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ. పి.కోటేశ్వరరావు తెలియజేశారు. ఎస్.ఐ.తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన అమరావతికి చెందిన యువకుడు చౌటుపల్లి కార్తీక్ దొంగతనాలతో జీవనం సాగిస్తున్నాడు. అమరావతిలో బైకుల దొంగతనాలపై బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కార్తీక్ ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.2.76 లక్షల విలువ చేసే బైకులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కార్తీక్‌ను రిమాండ్ నిమిత్తం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచారు. అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విఓఏలకు సమావేశం

**రాజుపాలెం, నవంబర్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాజుపాలెంలోని మండల సమాఖ్య కార్యాలయంలో స్థానిక ఏడి పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విఓఏలకు సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్ చేయూత లబ్దిదారులలో వాలంటీర్ ద్వారా ఆప్షన్ పశువులు కావాలని అడిగిన వారికి గ్రామాలలో విఓఏలు, పశు సంవర్ధకశాఖ సిబ్బందితో జాయింట్‌గా వెరిఫికేషన్ చేయవలసిందిగా తెలిపారు. వారు గ్రూపులోని వారైతే వారి అర్హతను బట్టి లోన్ బ్యాంక్ నుండి ఇప్పించే ఏర్పాటు చేయబడునన్నారు. మొక్కపాడు డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కావలసిన దరఖాస్తులు అందించారు. ఈ సమావేశంలో వైయస్‌ఆర్ క్రాంతి పథకం సిబ్బంది, ఏపిఎం సునీత, సిసిలు హరిప్రసాద్, బాజీ, విఓఏలు స్వప్న, శివలక్ష్మి, సచివాలయం, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి నెట్ బాల్ క్రీడాకారులకు అభినందనలు

**రాజుపాలెం, నవంబర్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజుపాలెం నుండి బాలుర క్రీడాకారులు 6 మంది రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడమే కాకుండా విజయవాడలోని సెయింట్ మేరీస్ స్టెల్లా కళాశాల నందు ఈ నెల 26 నుండి 27 వరకు జరిగిన అంతర జిల్లాల నెట్‌బాల్ క్రీడా పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయి సర్టిఫికెట్స్ పొందడం జరిగింది. గెలుపొందిన వారిలో చేవూరు గోపి, వాసా యశ్వంత్, పెమ్మా చరణ్‌తేజ, కుర్రా వెంకటేష్, గోసంగి యశ్వంత్, తోట ఉదయ్ ఈశ్వర్‌లు ఉన్నారు. విజేతలను రాజుపాలెం విద్యాకమిటీ చైర్మన్ చొక్కా రాంబాబు అభినందించారు. వీరంతా ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు డి.నాగరాజుని, ప్రధానోపాధ్యాయిని ఇ.అరుణశ్రీలను విద్యా కమిటీ చైర్మన్ చొక్కా రాంబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను చదువుతో పాటు క్రీడలలో కూడా ఎంతో ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, పాలవాయి ఆదినారాయణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



